# ఎ ఫ్రెండ్ ఇండీడ్

గండ్రేటి పెంటయ్య



శివరామ్ తలుపు తట్టేసరికి కల్యాణి చేస్తున్న పూజ పూర్తయింది. తలుపు తీసిన కల్యాణిని చూసి ఒక్క క్షణం నివ్వెరపోయాడు శివరాం. నుదుట గంధం. పాపిట సిందూరపు గీత ఎప్పుడూ వుండే కుంకుమ బొట్టు. నిరాడంబరంగా విరక్తిభావంతో వేదాంతినిలా ప్రత్యక్షమైన ఆమెను చూస్తుంటే కళ్ళలో నీళ్లు తిరిగాయి శివరామ్‌కు. పాతికేళ్ల నిండని కల్యాణి యాభయ్యో పడిలో పడ్డట్టు కనిపించింది.

ఎలా వుండే కల్యాణి ఎలా తయారయింది?

తను ఇదివరకు చూసిన కల్యాణికి,

ఈ కల్యాణికి ఎక్కడా పోలికే దొరకడంలేదు.

పుత్తడిబొమ్మలా వుండే కల్యాణి ఏమయ్యింది? మోములోని కళ, కళ్ల లోని కాంతులు, కల్యాణిలోని చురుకు దనం ఏమయ్యాయి?

"రా అన్నయ్యా!" అంటూ మంచం వాల్చింది కల్యాణి.

"పిల్లలేరమ్మా?" తెచ్చిన మిఠాయి నందించాడు.

"ఆటనుండి తిరిగిరాలేదు. ఇక వచ్చే వేళయింది. కూర్చో అన్నయ్యా, టీ తెస్తాను." అంటూ కల్యాణి గ్లాసు పట్టుకొని టీ దుకాణంకు బయలుదేర బోయింది. శివరామ్ వద్దని వారించాడు.

కల్యాణి భర్త రాజారావు. శివరామ్ రాజారావులు అతి సన్నిహితులు. ప్రాణ స్నేహితులు. రాజారావు పెళ్లి చూపులకు, ముందుగానే శివరామ్ కల్యాణిని చూసి వచ్చి, రాజారావుకి కల్యాణిని సెలక్ట్‌చేసి, తనే దగ్గరుండి పెళ్లి పెత్తనమంతా పైన వేసుకొని, పెళ్లి బ్రహ్మాండంగా జరిపించాడు. కల్యాణికి శివరామ్ అంటే విపరీతమైన భక్తి. స్వంత అన్నయ్యకన్నా మిన్నగా ఆదరించి గౌరవించేది. పండగ పబ్బాలకు స్వంత అన్నయ్యనుండి, శివరాంనుండి పిలుపు వస్తే, శివరామ్ యింటికి వెళ్ళ డానికే ప్రాముఖ్యత నిచ్చేది.

రాజారావు కల్యాణిల జీవితం రెండేళ్లపాటు స్వర్గమయమై తదుపరి రాజారావ్ దురలవాట్లకు లోనుకావ డంతో, నరకప్రాయ మయ్యింది. దానికి కారణంకూడ లేకపోలేదు.

రాజారావు పనిచేస్తున్న ఆఫీసుకు ఒక త్రాగుబోతు ఆఫీసరు రావడం రాజారావు పతనానికి నాంది పలికింది. ఆఫీసరుతో కేంపుల కెళ్ళేటప్పుడు మొగమాటానికని, కంపెనీకని ఆఫీసరుతో కలిసి త్రాగవలసి వచ్చేది. క్రమంగా అది అలవాటుగాను, తరవాత దినచర్యలో ఒక భాగంగాను, ఆటుపిమ్మట అదే తన లోకంగాను పరిణతి చెందింది. చివరకు రాజారావు పరిస్థితి యెలా తయారయ్యిందంటే, యింట్లో పెళ్లాం మంగళసూత్రం దగ్గర నుండి అన్ని విలువైన వస్తువులు బజారుకు చేరిపోయాయి.

ఆరువందల జీతంలో కనీసం నూరు వరకైనా యింటికిచేరడం గగనమే. ఆరువందల జీతగాడికి, ఇద్దరిపిల్లల తండ్రికి, కట్టుకోడానికి సరియైన బట్టలు లేవు. కడుపునిండా తిండికి కరువయ్యింది. ఇంటి గౌరవమర్యాదలు మంట గలిశాయి చుక్కపడిన సమయంలో కడు చురుగ్గా మాట్లాడగలడు గాని నిషా విరిగితే యెవరితోను సూటిగా నిలబడి మాట్లాడలేడు. స్నేహితుడి కళ్లలోకి చూడాల్సివస్తే తప్పుచేస్తున్నవాడిలా తల వంచేసుకుంటాడు. ఒకప్పుడు ఎంతో సన్నిహితంగా

వుండే స్నేహితులు బంధువులు, రాజారావు పరిస్థితులు మారడంతో, అతడితో మాట్లాడాలంటేనే పరువు పోతుందన్న తలంపుతో తప్పించుకు తిరుగుతారు.

ఇద్దరు పిల్లలు ఆటనుండి తిరి గొచ్చారు. పిల్లల దీనస్థితిని చూసిన శివరామ్‌కు దుఃఖం ఉవ్వెత్తున లేచింది.

"వీళ్ళిద్దరి చింతేనన్నయ్యా నాకు. ఇక యీ సంసారాన్ని ఈదడం నా తరం కావడంలేదన్నయ్యా. ఈ పిల్లల్ని నీ చేతిలో పెట్టి, మిగతా బ్రతుకునంతా యే భగవన్నామ స్మరణలోనో గడపా లనుకుంటున్నాను. అందుకే నీకు కబురు చేశాను గూడ."

"అంటే పరిస్థితి చాల విషమించిం దన్నమాట." శివరామ్ నుదుటను చేతులతో రుద్దుకున్నాడు.

"సరే యీ విషయాన్ని నా కొది లేయి. ఎలా బాగుంటుందని తోస్తే అలానే చేద్దాం," అన్నాడు మళ్లీ.


నిజానికి త్రాగుడనేది ఒకరకమైన శాపం. దాన్నుండి విముక్తి కలిగించడం యే దేవతల చేతిలోనూ వుండదని నా నమ్మకం. గమ్మత్తేమిటంటే, విముక్తి పొందడం ఆ త్రాగుబోతు చేతి లోనే వుండడం. త్రాగుడునుండి విముక్తి పొందాలన్న బలమైన కోరిక తనలో జనించి, పెరిగి పెద్దదయి, తను చేస్తున్న పని చేయకూడనిదని తరచు జ్ఞప్తికి తెస్తూ, తన మనసును స్వాధీనంలో నుంచుకొనే ప్రయత్నంలో సఫలుడయి నట్లయితే, జూదానికి అక్కమ్మ, ముండకు చెల్లెమ్మయిన మధువనే దేవత, తన భక్తులను కరుణించి దూరంగా నెట్టుతుంది, ఒడ్డున చేర్చుతుంది. అంత వరకు శాపగ్రస్తులై మునగవలసిందే.

"ఈ జన్మలో మరి మార్పురాదు. ఈ మధ్య మీ బావగారు ఆఫీసుకూడా వెళ్లటంలేదట. ఉన్న వుద్యోగం వూడ డానికి మరెన్నాళ్ళో పట్టదు. నేను గత జన్మలో చేసుకున్న పుణ్యఫలమిది. ఇలాంటి బ్రతుకు పగవారికూడ కోరను," అంది కల్యాణి కళ్లొత్తుకుంటూ.

శివరామ్ కల్యాణి మాట్లాడుకుంటూ వుండగా, యింటిముందు రిక్షా ఆగింది. రాజారావు మైకంతో జోగుతూ రిక్షా దిగాలని ప్రయత్నిస్తున్నాడు. కాని నిల ద్రొక్కుకోలేకుండా వున్నాడు. రిక్షావాడు చేయూతనిస్తే వాడిపై ఎగిరి పడ్డాడు.

"ఒరేయ్, త్రాగుబోతు వెధవా! ఒళ్లు దగ్గరపెట్టుకొని వుండు. నీలా త్రాగొచ్చాననుకున్నావటరా పూల్! సాయంపట్టొచ్చావ్!" ముందుకు వెనక్కు తూలుతున్నాడు రాజారావు

"ఏదో తప్పు జరిగిందిలెండిబాబు! నా కూలిచ్చి పంపిద్దురూ. అవతల బేరాలు పోతున్నాయి," రిక్షావాడి విసుగు.




జేబునుండి డబ్బుతీసి పదిరూపాయల నోటు రిక్షావాడి కిచ్చాడు రాజారావు.

"ఇదిగో రూపాయి నోటిస్తున్నా. పావలా తిరిగిచ్చేయి."

"చిల్లరలేదు బాబు."

"సరే తీసుకుపోరా. ఒరేయ్ చూడు, ఈ డబ్బులు పెట్టి త్రాగేయకుమీ. కష్టార్జితాన్ని కడుపునిండా తిను. అంతే గాని కడుపునింపుగా త్రాగకు." నీతులు చెపుతున్నాడు రాజారావు.

"అలాగే బాబయ్యా" అంటూ రిక్షా వెనక్కు తిప్పి పోబోతుంటే, శివరామ్ రిక్షావాణ్ణి పిలిచి, డెబ్బదిఐదు పైసలు చేతిలోపెట్టి పదిరూపాయలనోటు తీసుకున్నాడు.

శివరామ్‌ను చూసిన రాజారావు కళ్ళు నులుపుకొని మరీ చూశాడు.

"ఓహో శివరామ్‌గారా! రండి. రండి. దయచేయండి. చాన్నాళ్లకు దిగబడ్డారు. ఏమిటి విశేషం? ఇన్నాళ్లకు మాపై దయ కలిగిందన్నమాట." అంటూ కూర్చోమని రిక్షా సీటును చూపించాడు. ఏ ఒక్కమాట స్పష్టంగాలేదు. రాజారావు మాటలు, నటన అంతా గుంపులుగా నిలబడి వింతగా చూస్తున్న ప్రజలకు వినోదంగా వుంది. రాజారావు పలకరింపు వేళాకోళంగా వుండి అతడి మాటలకు అందరికి నవ్వొస్తున్నా, శివరామ్ గుండెల్లో మట్టుకు కోత కొనసాగుతూనే వున్నది.

ఒక్క గసురుతో రిక్షావాణ్ణి వెళ్ల గొట్టి, "యింట్లోకి పద రాజు, మాట్లాడు కుందాం" అంటూ శివరామ్ రాజారావును లోనికి తీసుకువెళ్లి మంచంపై పడుకో బెట్టాడు. మంచంమీద పడ్డదే తడవుగా మత్తుగా నిద్రలోకి జారిపోయాడు రాజారావు.

శివరామ్ బరువుగా నిట్టూర్పు విడిచాడు.

రాత్రి రెండు మెతుకులు కొరికి ఆరుబయట మంచంపై చేరగిలి ఆకాశంలోని చుక్కలు చూస్తు కూర్చు న్నాడు శివరామ్. ప్రతి చుక్కను ప్రాధేయపడి అడుగుతున్నది తన మనస్సు యీ సమస్యకు పరిష్కారాన్ని సూచించమని. ఆలోచనలను అన్ని చోట్లకు తరలిస్తూ ఉపాయంకోసం గాలిస్తున్నాడు.

లోపల కల్యాణి రాజారావును లేపు తున్నది. అన్నం తినమని ప్రాధేయ పడుతున్నది. ఎంత లేపినా రాజారావు కళ్లు విప్పలేకపోతున్నాడు. మధువవల్ల కలిగిన మత్తుకు చిత్తయి పడివున్నాడు.

చివరకు ఎలాగైతేనేమి రాత్రి పన్నెండు గంటలకు ఆ యిల్లాలి ప్రయత్నం ఫలించింది. కొంచెం నిషా దిగిన తరువాత రాజారావు భోజనం ముందు కూర్చున్నాడు.

"ఇదేంటి తియ్యగా తగుల్తోంది?"

"వంకాయ పచ్చడి." భయంగా జవాబిచ్చింది.

"నీ మొఖం. ఇదేంటి కంకరపీచులా?"

"క్యాబేజి, బంగాళదుంపలకూర."

"గాడిదగుడ్డు. ఈ వెధవ ఇంటిలో నోటికి రుచయిన కూర దొరకదుగదా! అడవిలో బ్రతుకుతున్నట్టు ఎంతసేపు దుంపలు కందలూను. ఛీ....ఛీ...." మరు క్షణంలో గిన్నెలు కంచాలు శివరామ్ పడుకున్న మంచం కిందకు వచ్చి పడ్డాయి. కల్యాణి వీపుపై పిడుగుల వర్షం కురిసింది. శివరామ్ లోపలకు పరుగెత్తి అడ్డుకున్నాడు. దృఢకాయు డయిన శివరామ్ కుదుపుకి రాజారావు మళ్లీ మంచంమీద పడ్డాడు. నోటికి వచ్చినట్టు గొణుక్కుంటూ నిద్రలోకి జారిపోయాడు.

"కల్యాణీ కొద్దిగా తిని పడుకో వమ్మా!" నీ సంసారం చక్కబడేవరకు నేను జాగుకొనే వుంటానులే. నీవు నిశ్చింతగా వుండు. నీకొచ్చిన భయ మేమీలేదు." అంటూ విషయాన్నంతా ఆమెకు బోధపరచి, బయటకు వచ్చి తన మంచంమీద నిద్రపోయాడు.

ఎండ చురుక్కున తగిలేసరికి తెలివి వచ్చింది శివరామ్‌కు. లేచి చూడబోయే సరికి, తల కాలి ముకుకులమధ్య పెట్టు కొని అరుగుమీద కూర్చున్నాడు రాజారావు.

శివరామ్ రాజారావుతో మాట్లాడ లేదు కోపాన్ని నటిస్తూ.



"అమ్మా, కల్యాణీ" లోనికి కేక పెట్టాడు శివరామ్.

సమాధానంలేదు. ఒక్క ఉదుటున లోపలికెళ్లి అంతా గాలించాడు. ఎక్కడా ఏ అలికిడీ లేదు. రాజారావు మాత్రము శివరామ్ చూపులను తప్పించుకుంటు అటూ ఇటూ చూస్తున్నాడు.

"రాజూ, చెల్లెమ్మ, పిల్లలు ఏమయ్యారు?" ఆతృతతో, కీడును శంకిస్తూ ప్రశ్నించాడు శివరామ్.

రాజారావు మాట్లాడలేదు. అతడి చేతిలో ఏదో కాగితం రెపరెపలాడింది. లాక్కొని చదువుకున్నాడు శివరామ్.

"పూజ్యులైన భర్తగారికి,

నమస్కారములు. ఒప్పుకుంటాను మీరు పెళ్లయిన రెండు సంవత్సరాల వరకు అమరసుఖాల నందించారు. ఆ తరువాత గడచిన ఒక్కొక్క రోజు నా అంతిమ ఘడియకు ఒక్కొక్క

మెట్టుగా లెక్కించుకొచ్చాను. ఇంత వరకు పిల్లల భవిష్యత్తుకోసమని భరించి వున్నాను. కాని మీ నీడలో పెరిగిన పిల్లల భవిష్యత్తెలా వుంటుందో అంచనా వేయగలరనుకుంటాను. తండ్రికి మించినవారై, యింటికి మీరు తెచ్చిన కీర్తికి నాలుగురెట్లు తేగలరు. బయట పెంచడానికి తగిన సహాయ సానుభూతి లెక్కడ లభ్యమవుతాయి? అందుకే మేమంతా గంగామాత గర్భంలో తలదాచుకోబోతున్నాం. మీరు మా గురించి వెదికి అనవసరంగా పోలీస్ గొడవల్లాంటివి తెచ్చుకోవద్దు. చివరిసారిగా మా కోర్కె. మీరు మీ లోకంనుండి, నిజలోకంలోకొచ్చి బ్రతకగలిగితే మా ఆత్మలు సంతోషిస్తాయి.

ఇట్లు

మీ త్రాగుడుకి ఆహుతయిన భార్య,

కల్యాణి."

ఉత్తరం చదివిన శివరామ్ కళ్లు ఎఱ్ఱబడ్డాయి.

"కల్యాణిని చంపింది నువ్వు. నువ్వు హంతకుడివి. నువ్వు ఉరిశిక్షకు తప్ప మరో శిక్షకు అనర్హుడవు. నిన్ను పోలీసులకు పట్టిస్తానుండు." కోపంతో ముఖం కందగడ్డయింది శివరామ్‌కు.

"శివరామ్ నన్ను క్షమించు శివరామ్. తప్పంతా నాదే. నేనే నా చేతులారా వాళ్లను చంపుకున్నాను. ఐతే నన్ను అన్నిచోట్లా వెదకనియ్యి. తరువాత నీ యిష్టం." చేతులు పట్టుకున్నాడు రాజారావు.

"సరే కానీయి. ఆ సంగతేదో యీ రోజునే తెలిసిపోదా? ఒకవేళ వాళ్లు దిగితే రాణీఘాట్‌లోనే దిగివుంటారు. పద వెదుకుదాం."

ఇద్దరూ రాణీఘాట్‌కు వెళ్లి జాలరి వాళ్లను వాకబు చేశారు. వీళ్ల మాటలను విన్న ఒక ముసలి జాలరి వచ్చి-"ఏమో బాబు ఏం జరిగిందోగాని, తెల్లవారు నాలుగుగంటలప్పుడు, నేను దోనెలో చేపలకోసం తిరుగుతుండగా, యీ ఘాట్‌లోనే ఎవరో యిద్దరు పిల్లలు - 'అమ్మా అమ్మా' అంటూ ఏడుస్తున్నారు. ఏమయిందా అని నేను దోనె మళ్లించుకొని తిరిగి రాబోయే సరికి అరగంట పట్టివుంటాది. కాని నేను దారిలో వుండగానే ఏడుపులాగిపోయాయి బాబు. ఈ నీటిలో కొట్టుకుపోయారో, లేకపోతే ఎక్కడికైనా పోయారో చెప్పలేను బాబు," అన్నాడు.

రాజారావు పిచ్చెత్తినట్టు అంతా తిరిగాడు. ఎక్కడా ఆచూకీ దొరకలేదు.

చివరకు శివరామ్ అన్నాడు-"సరేలే రాజూ! పోయినవాళ్లెలాగూ తిరిగిరారు. వాళ్లు బ్రతికున్నప్పుడు చూసేందుకు మనకొక్క క్షణమైనా తీరికవుండేది కాదు. ఇప్పుడెందుకు టైం వేస్ట్‌చెయ్యాలి చెప్పు. ఈవేళ నాకూడా నీతో కలిసి త్రాగాలని వుంది. పద. ఈ

సంసార బంధాన్ని త్రెంచుకోడాని కిదొక్కటే సరియైన మార్గంలా వుంది సుమా! నీ బుద్ధి అమోఘం రాజూ! విడాకులిచ్చుకుందామంటే బోలెడన్ని గొడవలు. త్రాగి తందనాలాడితే పెళ్లాం పిల్లలు పత్తా చెప్పకుండా పారిపోతారు. నీవు అదృష్టవంతుడవు సుమా. నాకో దారి చూపించి పుణ్యంకట్టుకోవోయ్."

రాజారావు వంచిన తల యెత్తలేదు. అవమానంతో కుమిలిపోతున్నాడు.

"ఏంజేయమంటావ్ శివరామ్. నిషా విరిగిన తరవాత మరి త్రాగకూడదే అనుకుంటాను. కల్యాణిమీద, పిల్లల మీద ఎన్నో ప్రమాణాలు చేశాను. కాని ఆ నిశ్చయం క్షణికమే. నాకు తెలియని శక్తేదో మళ్లీ నన్నటే నడుపు తుంది. త్రాగిన తర్వాత సర్వమూ సమానమే. మంచి చెడుల యోచన అసలు తెలియదు. పిచ్చిగా యేదో చేస్తుంటాను. నా మనస్సు అదుపులో వుండదు."

"ఆ సంగతేదో త్రాగిన తరువాత చర్చించుకుందాం. ముందుపద."

శివరామ్ రాజారావ్‌ను యింటికి తీసుకువచ్చాడు. వచ్చేటప్పుడు దారిలో రెండు సీసాల నాటుసారా కూడ పట్టు కున్నాడు.

"రాజూ, రెండుగ్లాసులు తీస్తావా, లేక సీసాలతోనే కానిద్దామా?"

మౌనంగా రెండుగ్లాసులందించాడు రాజారావు.

అతడి ప్రతి కదలికను కనిపెడు తూనే వున్నాడు శివరామ్.

రెండుగ్లాసులు ఎఱ్ఱని ద్రవంతో నింపేశాడు శివరామ్.

"రాజూ! చూడు, ఈ గ్లాసు కల్యాణి కన్ను మూసినందుకు చీర్స్ పలుకుతూ కానీయి, మరో గ్లాసు నీ పిల్లలిద్దరు పరలోకం చేరినందుకు పరమానందంగా త్రాగేసేయి. మిగిలినదంతా, నీకు ప్రాప్తించిన సంసార విముక్తికి సంబర పడుతూ సేవిద్దువుగాని.

ఈ మాటలకు, ముందుకు జరిపిన చెయ్యిని, నీరసంగా వెనక్కు లాగేసు కున్నాడు రాజారావు.

"ఈ ద్రవాన్ని చూడు రాజూ! రక్తంలా ఎలా ఎఱ్ఱగా వుందో, కల్యాణి రక్తంలా, కన్నకొడుకుల రుధిరంలా. ఏం? ఈ రసానికి బదులు, వాళ్ల రక్తం త్రాగినా నీ ఆరోగ్యం రెండింతలు పెరుగును. దానిలో వుండే నూరోవంతు నిషాగాని, మజాగాని యీ రంగునీటిలో వుంటుందా?"

శివరామ్ ఒక్కొక్క మాటకు రాజారావు రక్తం సలసల కాగి పోతున్నది.

"శివరామ్ నీ మాటలు హద్దు మీరు తున్నాయ్!" ఈ మాటను ఖాతరు చెయ్య లేదు శివరామ్.

"నాకు తెలుసు. నీకు కావలసింది తాగుడుగాని, యిల్లు వాకిలి పెళ్లాం పిల్లలు బ్రతుకు ఏవీ అక్కరలేదు. అవి కావలసిన రాజారావువే అయితే నీ విలా నిబ్బరంగా కూర్చోగలవా? నోట్లో రెండు చుక్కలేసుకుంటే సాయంత్రంవరకు చక్కగా నిద్రపోగలవు. మళ్లీ మరో బోతలాడిస్తే, తెల్లవారేవరకు తెలివే రాదు. ఇలాగే రోజులన్నీ గడపగలవు. అలాంటి నీకు పెళ్లా మెందుకు? పిల్లలెందుకు?

"శివరామ్!" కోపంతో వూగిపోయాడు రాజారావు.

"ఏం ఏమయ్యింది? ఒక్కసారి జ్ఞాపకం తెచ్చుకో రాజూ! మన చిన్నప్పటి రోజులు. మన ఫ్రెండ్ సర్కిల్‌లో అద్భుతంగా వెలిగావా రోజుల్లో. నీ వప్పుడే మర్చిపోయావా? ఒకనా డొక డ్రింక్ పార్టీలో, త్రాగుబోతులను విరశిస్తూ, దానివల్ల కలిగే నష్టాలను వ్యక్తపరుస్తూ నీ విచ్చిన ప్రసంగం ఇప్పటికీ నా చెవుల్లో మారుమ్రోగుతున్నది. కల్యాణి నీ ప్రాంగణంలో అడుగుపెట్టిన తరువాత విస్నూ నీ యింటిని చూసి ఎంతమంది అసూయ పడలేదు? కల్యాణితో గడిపిన ఒక్కొక్క మధురానుభూతిని వర్ణించి నా దగ్గర చెబుతుండేటప్పుడు నే నేమని కోరుకునే వాణ్ణో తెలుసా? నూరేళ్ల నీ జీవితం ఇలాగే మధురంగా గడిచేటట్టు చేయమని దేవున్ని కోరుకునేవాణ్ణి. ఆ రోజుల్లో నీ ఆఫీసులో నీ కెంత గౌరవప్రతిష్ఠ లుండేవి? ఈ వీధిలో ప్రతి ఒక్కరు ఎంతటి గౌరవమర్యాదలు చూపేవారు! ఎందుకు? అప్పటి నీ వ్యక్తిత్వం వేరు. అప్పటి నీ కల్యాణికి, ఇప్పటి కల్యాణికి తేడా గమనించావా? అప్పుడు నీవు నెలకు మూడువందలు తెచ్చుకొని, నీవు భార్య సమృద్ధిగా గడుపుకొంటూ, నలుగురికి పెట్టగలిగేవారు. కాని యీనాడు? ఆరువందల రూపాయ లార్జిస్తున్నావు. ఐనా పొట్టనిండా తిన గలుగుతున్నారా? కట్టుకునే గుడ్డకు నోచుకోవడం లేదే! కల్యాణి కడుపు నిండా తిన్నది లేనిది యేనాడైనా గమనించావా? నీ పిల్లలు అర్ధాకలితో అదీ యిదీ తింటూ కాలం వెళ్లబుచ్చటం చూశావా? నువ్వు రోజూ సాయంత్రం పూలరంగడిలా తూలుతు యిల్లు చేరే వేళ నీవు చూపబోయే నాటకాన్ని గుంపులుగా చేరి వింతగా చూస్తూ వినోదిస్తున్న యీ వీధివాళ్లను యేనాడైనా గమనించావా? కళ్లలో వత్తులు వేసుకొని నీ రాకకోసం నిరీక్షించే నీ యిల్లాలికి నువ్విచ్చే పరిహార మేమిటో జ్ఞాపకం వుందా? అనురాగానికి బదులు వీశెడేసి గుద్దులు. ఒక్కొక్క పైసా నిఖరంగా వెచ్చించి, తాను, పిల్లలు అర్ధాకలితో అఘోరిస్తూ నీ కోసమని వండి దాచిన వంటకాలను నీ వేమిచేస్తున్నావో




యేమైనా తలంపుకు వస్తుందా? నేలపాలు చేస్తున్నావు రాజా, నేలపాలు చేస్తున్నావు. అభం శుభం ఎరుగని పిల్లలిద్దరు కన్నతండ్రిని చూసి బెబ్బులొస్తున్నట్టు భయపడి యే మంచం క్రిందనో లేక పెట్టిమూలనో దాక్కోవడం నీవు గమనించే స్థితిలో యేనాడైనా వున్నావా? ఇదంతా దేనివలన? ఈ మార్పులకు కారణమేమిటి? భావియుగాని కుపకరించవలసిన రెండు నిండుప్రాణా లంతమవడానికి బాధ్యులెవరు? అన్నిటికీ కారణం యిదే. యీ యెఱ్ఱనీళ్లే. ఈ ఎఱ్ఱనీళ్లను మింగితే, నీ మంచిని, నీ ఉన్నతిని, నీ పరపతిని, చివరకు నీ పత్నిని, పుత్రులను అన్నిటినీ సునాయాసంగా మింగేసింది యీ రంగునీరు. చివరకు నువ్వు మిగిలావు. అదీ ఇంకెన్నాళ్లులే. ఏదో రోజున డాక్టరు గుండెజబ్బో, బ్లడ్ ప్రెషరో, యేదో జబ్బుందని చెప్పడం ఖాయం. ఇన్నాళ్ల నీ త్రాగుడు నిన్నూరకనే వదిలిపెడుతుందా?" ఏకధాటిగా చెప్పేసి, మళ్లీ శ్వాసను పుంజుకొని అన్నాడు శివరామ్-

"ఈ నవయుగంలో అన్నీ మానవుని దాసులు. కాని మానవులు మాత్రం మధువుకు బానిసలు. ఈ నాటు సారా ఇది యెంతటి మోటు గుణముంటే, అది నిండు బ్రతుకులను మోడువార్చి నిలువునా దహనం చేస్తుంది. నీ భార్య పంచే అనురాగం, హాయి, మత్తు, మహా

నందంలో, నీవు ఖాళీచేసిన యీ గ్లాసెడు మధువు యిచ్చేది యెన్నో వంతు? భగవన్నామ స్మరణలో ఈ ప్రపంచాన్నే మర్చిపోగలవే! దానిలోనుండే బ్రహ్మానందం దీనిలో వుందని భ్రమపడుతున్నావా? ఈ జీవిత పరిమాణం అత్యల్పం. అందులో యవ్వనం బుద్బుదప్రాయం. నీ సమయాన్నంతా యీ రకంగా దుర్వినియోగం చేస్తే, మానవజీవితంలోని మాధుర్యాన్నెప్పు డనుభవిస్తావ్? త్రాగేవాళ్లంతా యేదో మిష జూపి తప్పుకుంటారు. మనస్సు బాగులేక ఒక్క చుక్క తీసుకున్నానని ఒకడంటే, ఒంట్లో నిస్సత్తువగా వుండి గుట్టుమెక్కానని మరొకడు సంజాయిషీ ఇచ్చుకుంటాడు. మనస్సు బాగులేనప్పుడు పరిస్థితుల మార్పు, నిస్సత్తువకు సారమున్న తిండి తప్పిస్తే, మరో సరియైన నివారణోపాయం నీకేమైనా తోస్తుందా? ఎవరైతే దినచర్యను సవ్యంగా పాటిస్తారో వాళ్లకు త్రాగి తందనాలాడాలన్న తలంపే ఉండదు. ఉదయం భగవన్నామ స్మరణతో ప్రారంభించి, రోజంతా ఎంగేజ్‌మెంట్స్, సాయంత్రమలా ప్రశాంతమైన స్థలానికి షైరు, తరువాత యింటిలో సరదాగా కాలక్షేపం, రాత్రి మనోవికాసం కోసం బుక్ రీడింగ్, అటు పిదప భార్య సన్నిధితో పూర్తయిన రోజు సుఖప్రదమైనది. సంసారమనే మీ ద్విచక్రబండిని గమ్యస్థానం చేర్చడం మీ బాధ్యత. రెండింటిలో ఏ చక్రం గాడి తప్పినా మొత్తం బండి అంతా మొగ్గలేస్తుంది." శివరామ్ ఇంకా చెప్పుకుపోతున్నాడు.

అంతా వింటూ, ఆ గ్లాసులవంకే చూస్తున్న రాజారావుకు ఆ ద్రవమే ఒక పిశాచంగా మారి, తన గొంతుక ద్వారా లోపల ప్రవేశించి, తన గుండెలను పిండుకుంటూ రక్తాన్ని జుర్రుకుంటున్నట్టు, తన కలేజానునంజుకుంటున్నట్టు భ్రమ కలిగింది.

తన పరిస్థితులను తారుమారు చేసిన ఆ ద్రవముపై తొలిసారిగా ఏహ్యభావం కలిగింది రాజారావుకు. ఇవన్నీ శివరామ్ గమనిస్తూనే వున్నాడు.

"ఆలస్యమెందుకు కానీయి. ఘాటు తగ్గిపోతే మజా ఏముంటుంది?" ఒత్తిడి చేశాడు శివరామ్.

రాజారావు ఒక్క తోపుతో టేబిల్‌ని తన్ని సీసాలను గ్లాసులను పగులగొట్టాడు కోపంగా. మధువంతా నేల గుప్‌మన్నది.

"నేను పాపిని. నా కల్యాణిని కాలదన్నుకున్నాను. నా యిద్దరి పిల్లలను నాకు కాకుండా చేసుకున్నాను. ఈ బ్రహ్మరాక్షసి భ్రమలో పడి నేనన్నీ కోల్పోయాను. నేను బ్రతికి నిష్ప్రయోజనం; నా కల్యాణిని కలుసుకోవడంలోనే వుంది నా పాపానికి నిష్కృతి." పిచ్చివాడిలా పరుగెత్తాడు రాజారావు.

అతణ్ణందుకోవడానికి శివరామ్ కూడ పరుగు లంకించుకున్నాడు.

రాజారావు పరుగెత్తి పరుగెత్తి ఒగరుస్తూ ఒకచోట కుప్పలా కూలి పడ్డాడు స్పృహ తప్పి.

రాజారావ్ కళ్లు తెరిచేసరికి ఆస్పత్రిలో బెడ్‌మీదున్నాడు. శివరామ్ కూడ ప్రక్కనే వున్నాడు. డాక్టరు పరీక్ష చేసి ఎక్స్‌రే తియ్యాలని, ఊపిరి తిత్తులలో కొంచెం లోపమున్నట్టు అను మానంగా వుందని చెప్పాడు. రాజారావు పశ్చాత్తాపంతో కుమిలిపోతున్నాడు.

మూడురోజులు ఆస్పత్రిలోనున్న తరువాత, నాలుగోరోజు సాయంత్రం, కల్యాణి, పిల్లలు ఏడ్చుకుంటు ఆస్పత్రిలో అడుగుపెట్టారు.

ఒక్క నిమిషం రాజారావు నమ్మలేనట్టుగా చూశాడు. తరువాత శివరామ్ కళ్లలోకి చూశాడు.

జవాబుగా శివరామ్ - "కల్యాణి, పిల్లలు తిరుపతి వెళ్లి నీలో మార్పు కలిగించమని ఏడుకొండలవాణ్ణి వేడుకొని తిరిగి వస్తున్నారు. వాళ్లు తిరిగివచ్చు సరికి నీవు మారిపోయావు. చూశావా దేవుని ప్రభావం," అన్నాడు.

"మరి నీవు చేసిన హంగామా అంతా?"

"అది మరేంకాదు. నీలో మార్పు తేవడానికి చేసిన ఏర్పాటు."

రాజారావు శివరామ్ చేతుల్ని పట్టుకొని కళ్లకద్దుకున్నాడు. "నీ ఋణం ఈ జన్మలో తీర్చుకోలేం శివం. నిజంగా నాకు మరో జన్మ నిచ్చావు." కళ్లలో కృతజ్ఞతాభావం వ్యక్తమయ్యింది.

కల్యాణి వచ్చి ప్రక్కన కూర్చొని తల నిమరగానే, ఆమె చేతినందుకొని బుగ్గలకు రాసుకున్నాడు రాజారావు తన్మయత్వంతో.

"నన్ను క్షమి...." మాట పూర్తి కాకముందే అతని పెదవులను ప్రేమగా మూసేసింది కల్యాణి.

ఇద్దరి పిల్లలను తీసుకొని శివరామ్ బయటికి వచ్చేశాడు ఏకాంతం కలిగిద్దామన్న తలంపుతో.

అలాంటి అన్నయ్య దొరికినందుకు కల్యాణి కళ్లలో గర్వం తొంగి చూసింది. 'రక్తం పంచుకుని పుట్టకపోయినా, శక్తికి మించిన సహాయాన్నందించావన్నయ్యా' అంటూ మనస్సులోనే కృతజ్ఞతను తెలుపుకున్నది కల్యాణి.